దృష్టి లేనివారికి అవకాశాలు కల్పించాలి

హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కంటిచూపు లేని పిల్లలకు తగిన అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని దేవనార్ ఫౌండేషన్ ఫర్ ద బ్లైండ్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సాయిబాబాగౌడ్ అన్నారు. శనివారం త్రివేణి ఫౌండేషన్ తమ రెండవ ప్రొఫెసర్ ఐ.వి. చలపతిరావు స్మారక ఉపన్యాసాన్ని దోమల్‌గూడలోని రామకృష్ణ మఠ్‌లో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిబాబాగౌడ్ 'దివ్యాంగులైన పిల్లలకు సానుభూతి, మద్దతు అవసరం. గ్రామీణ పాఠశాలల నుంచి భారతదేశంలోని ఐఐఎంల వరకూ - ఏ కేస్ స్టడీ' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. 1992లో నలుగురు పిల్లలతో దేవనార్ పాఠశాలను అద్దె భవనంలో ప్రారంభించామని తెలిపారు. కంటి డాక్టర్‌గా తనను చూడాలనే తన తండ్రి కోరిక, తన వద్దకు వచ్చిన తల్లిదండ్రుల కన్నీళ్లు, దృష్టి లేని పిల్లలు తమ కాళ్ల మీద తాము నిలబడటానికి మద్దతునివ్వాలనే ఆలోచన... తాను దేవనార్ ఫౌండేషన్ ఫర్ ద బ్లైండ్ ప్రారంభించడానికి కారణాలుగా వెల్లడించారు. తమ పాఠశాలలో సంవత్సరమంతా అడ్మిషన్లు జరుగుతుంటాయని, ప్రతి ఒక్కటీ తమ పాఠశాలలో ఉచితమేనని ఆయన పేర్కొన్నారు. దేవనార్ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయమని రామకృష్ణ మఠ్ అధ్యక్షులు స్వామి బోధమయానంద అన్నారు. కార్యక్రమంలో భాగంగా దేవనార్ ఫౌండేషన్ విద్యార్థులు తాము రూపొందించిన పలు శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి ఫౌండేషన్ చైర్మన్ ప్రొఫెసర్ వై.శ్రీధర్ మూర్తి, డాక్టర్ సాయిబాబా సతీమణి జ్యోతిగౌడ్, దేవనార్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

లా పూర్తి చేసిన వారికి ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి):'లా' పూర్తి చేసిన అభ్యర్థులకు మూడేళ్ల ఉచిత శిక్షణ ఇవ్వడానికి హైదరాబాద్ జిల్లాలోని బీసీ అభ్యర్థుల నుంచి 2025-26 విద్యా సంవత్సరానికిదరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ కదీవరన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు యూజీసీచే గుర్తించిన విద్య సంస్థ నుంచి "లా" కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలని, అభ్యర్థులు లేదా వారి కుటుంబంలో ఎవరైనా గతంలో ఈ ఉచిత శిక్షణ పొంది ఉండరాదని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలని తెలిపారు. బీసీ-ఏ (1), బీసీ-బీ (2), బీసీ-డీ (1) మొత్తం నలుగురు అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఉపసంచాలకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా 4వ అంతస్తు, స్ఫూర్తి భవనం, గ్లోబల్ హాస్పిటల్ పక్కన, లక్డీకాపూల్, హైదరాబాద్ అనే అడ్రస్‌కు ఆగస్టు 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అందజేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వివరాలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సర్టిఫికెట్స్ జీరాక్స్ కాపీలను జత చేయాలని సూచించారు.

ఆలయాలలో భక్తిశ్రద్ధలతో పూజలు

నల్లకుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రావణమాసం పురస్కరించుకుని శనివారం నగరంలోని పలు ఆలయాలలో నవ చండీ సహిత శత రుద్రం, సంతాన నాగదేవత జగన్మాత ఆలయంలో చండీ పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి పోచంపల్లి రమణారావు, బీఓపీడబ్ల్యూఏ ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, కానాల శ్యాంసుందరావు, గూడ రాజేశ్వరరావు, గూడ జయరాం, నర్వ రఘు, పసుపులేటి కొండల స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చండీ హోమం నిర్వాహకులు కీర్తన, అభిషేక్‌లు సేవాసమితి ప్రతినిధులకు శాలువాకప్పి సత్కరించారు.

సమాజహితానికి సంత్ గాడ్గే బాబా కృషి

నల్లకుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాడు సమాజంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన వ్యక్తి సంత్ గాడ్గే బాబా అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం సంత్‌గాడ్గే బాబా స్ఫూర్తి సేవాకేంద్రం నిర్వాహకులు పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నల్లకుంట డివిజన్ రత్నానగర్ కమ్యూనిటీహాల్‌లో మానవసేవే, మాధవసేవ అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, జి.ఆనంద్‌గౌడ్ హాజరై సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నల్లకుంట డివిజన్ ప్రధానకార్యదర్శి ఎంటీ.కిషోర్‌కుమార్, ఓబీసీ మోర్చా నాయకుడు యాదగిరి, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ

నల్లకుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సంత్ గాడ్గే బాబా స్ఫూర్తి సేవా కేంద్రం నిర్వాహకులు పి.శ్రీనివాస్, ఓబీసీ మోర్చా నాయకుడు యాదగిరి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లోని పేద విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ యాకర అమృత ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయడం ఇతర సంస్థలకు స్ఫూర్తి కల్పించాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో మాలలకు ప్రాధాన్యం కల్పించాలి

నల్లకుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాలలకు ప్రాధాన్యం కల్పించాలని నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షుడు తాలుకా రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, మున్సిపల్, కార్పొరేషన్, వార్డు కౌన్సిలర్లకు అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో దళిత బహుజనుల ఐక్యత కోసం నేషనల్ అంబేడ్కర్ సేన పనిచేస్తుందన్నారు.

వైభవంగా హనుమాన్‌చాలీసా పారాయణం

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం వైభవోపేతంగాజరిగింది. ఈ కార్యక్రమాన్ని హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందం ధర్మజాగరణ సమితి, చిక్కడపల్లి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం రాత్రి ఏడున్నర నుంచి ఎనిమిదిన్నర గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రతినెలా రెండో శనివారం రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిదిన్నర వరకు జరుగుతుందన్నారు.

నేడు జీవనసాఫల్య పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొమర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన సాఫల్య పురస్కారాల ప్రదాన సభను ఆదివారం ఉదయం నారాయణగూడ తాజ్‌మహల్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు సంస్థ ముఖ్యసభ్యులు దుర్గాప్రసాద్, రవి తెలిపారు. 2024, 2025 సాహిత్యరంగంలో ఓలేటి పార్వతీశం, ఆచార్య తాడేపల్లి పతంజలి, 2024, 2025 విద్యారంగంలో ఆచార్య సీఆర్ విశ్వేశ్వరరావు, వింజమూరి బాలమురళికి శాంత బయోటెక్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ డా.కేఐ వరప్రసాద్‌రెడ్డి బహూకరిస్తారన్నారు.

శ్రీహరిస్వామికి డాక్టరేట్

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ జ్యోతిష్యులు, అర్చకులు తెనాలి శ్రీహరిస్వామికి జ్యోతిష్యంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ అచీవ్‌మెంట్ అవార్డ్స్, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ అకాడమీ, రియల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తమిళనాడు రాష్ట్రం హోసూరులోని ఓ హోటల్‌లో ఈ డాక్టరేట్‌ను శ్రీహరి స్వామికి విశ్రాంత అసిస్టెంట్ న్యాయమూర్తి డా.జె. హరిదాస్, కరాటే వరల్డ్ రికార్డ్ హోల్డర్ డా.కరాగే శ్రీనాథ్, విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ డా.లయన్ ఎస్‌వీ.చబ్బి, ఆచార్య గణేశ్వర మహాస్వామి, బసవరాజ మహాస్వామి ప్రదానం చేశారు.

అబ్బాయితో వెళ్లిపోతున్నా..!

బర్కత్‌పుర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'ఓ అబ్బాయిని ఇష్టపడ్డా. అతనితో వెళ్లిపోతున్నా.. కంగారు పడొద్దు' అని తండ్రి ఫోన్‌కు మెసేజ్ చేసిందో కూతురు. కాచిగూడ రైల్వే పీఎస్ ఎస్‌ఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గుంతకల్‌కు చెందిన సంజయ్‌కుమార్ కుమార్తె కృతిక(19) ఇంటర్ పూర్తి చేసింది. కాచిగూడకు రావడానికి శుక్రవారం రాత్రి గుంతకల్‌లో ఎల్లంక- కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలును తల్లిదండ్రులు కూతురుతో కలిసి ఎక్కారు. శనివారం ఉదయం 5.10 గంటలకు కాచిగూడకు చేరుకున్నాక తల్లిదండ్రులకు కృతిక కనిపించలేదు. కొద్ది సేపటి తర్వాత తండ్రి సంజయ్‌కుమార్ సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అందులో ఒక అబ్బాయిని ఇష్టపడి అతనితో వెళ్లిపోతున్నాను. కంగారు పడొద్దని కృతిక పంపించింది. దీంతో తండ్రి కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ పనులను పూర్తిచేయాలి

ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, మున్వర్‌చాంద్ తదితరులు

ముషీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే గోపాల్‌ను బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకుడు మున్వర్‌చాంద్ కలిసి భోలక్‌పూర్‌లో నత్తనడకన కొనసాగుతున్న పనులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సిద్దిక్‌నగర్‌లో కచ్చానాలా పనులు, శేఖర్‌రెడ్డి వీధిలో నాలా పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పనులు పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్, ఆర్.శ్రీనివాస్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ముక్రమ్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భోలక్‌పూర్‌లో బోనాలు

ముషీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని రంగానగర్‌లో ఆదివారం శ్రావణమాస బోనాల పండుగ నిర్వహించనున్నట్లు రంగానగర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, భూలక్ష్మి, నల్లపోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ వెంకటేష్ తెలిపారు. శనివారం రంగానగర్‌లోని అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆదివారం బోనాలు, తొట్టెల ఊరేగింపు ఉంటుందని, సోమవారం పోతరాజులు, ఫలహారబండ్ల ఊరేగింపులు ఉంటాయని అన్నారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్‌తో పాటు వివిధ పార్టీ ముఖ్యనేతలు హాజరవుతారని తెలిపారు.

రైతుల హామీల అమలులో విఫలం : ఆప్

కవాడిగూడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు మేనిఫెస్టోలో రైతుల కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆప్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బుర్ర రాముగౌడ్, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి స్వర్ణ సుబ్బారావు ఆరోపించారు. శనివారం లిబర్టీలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అది 30 శాతం రైతులకు మాత్రమే ఇచ్చిందన్నారు. ప్రభుత్వ అలసత్వం, వ్యవసాయ శాఖ మంత్రి, అధికారుల సమన్వయ లోపం వల్ల సాగునీరు సకాలంలో అందడం లేదన్నారు. సీజన్ ప్రారంభమై నెల దాటిన ఎరువుల కొరత రైతులను వేధిస్తూనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దర్శనం రమేష్, మామిడి శెట్టి శివాజీ, సుధారాణిగౌడ్, న్యాయవాది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రులు పేదలకు వైద్య సేవలందించాలి



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేష్, బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులు

బర్కత్‌పుర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ఆస్పత్రులు సామాజిక బాధ్యతతో పేదలకు వైద్య సేవలందించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం కాచిగూడలోని ప్రతిమ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి, మాట్లాడారు. లాభార్జన దృష్టితో కాకుండా ప్రతిమ ఆస్పత్రి పేదల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, ప్రతిమ గ్రూప్ ఆఫ్ ఆస్పిటల్స్ అకాడమిక్ మెడికల్ సర్వీసెస్ విభాగాధిపతి డాక్టర్ జి.హరిచరణ్, కార్డియాలజిస్ట్ డాక్టర్ కొండల్‌రావు, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సుప్రియ, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీదేవి, ఆర్థోపెడిక్స్ డాక్టర్ శ్రీకృష్ణ, డాక్టర్ దేదీప్య, డాక్టర్ జగదీష్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

దాశరథి రచనలు, కవితలు నేటితరానికి స్ఫూర్తి



దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ దేవేంద్ర, డాక్టర్ ముదిగొండ భవాని తదితరులు

రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను దాశరథి తన రచనలు, కవితలు, పాటల ద్వారా వెల్లడించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. దాశరథి రచనలు, కవితలు, పాటలను నేటితరం యువత స్ఫూర్తిదాయంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో వెంకట్ కళా సెమినార్ హాల్‌లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో దాశరథి శత జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ దేవేంద్ర హాజరై దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు. దాశరథి జీవితంలోని ఎన్నో విశేషాలును సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణుప్రియ, ప్రొఫెసర్ యాదగిరి, డాక్టర్ మాధవి, డాక్టర్ కవిత, అధ్యాపకులు డాక్టర్ అశోక్, డాక్టర్ ముదిగొండ భవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యంలో ఎన్నో ఉపయోగాలు: వక్తలు



ప్రకృతి వైద్యులు వెంకన్నను సత్కరిస్తున్న నర్సయ్య, సయ్యద్ ఇమామ్

రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైద్యంతో ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మనిషి ఆనందకరమైన జీవితాన్ని గడపడానికి, ఆరోగ్యంగా ఉండడమే మహాభాగ్యం అని వారన్నారు. శనివారం సిద్ధార్థ ప్రగతి ఆరోగ్య కేంద్రం, గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వైద్యం ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ జన సమితి గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య, ప్రముఖ మోటీవేటర్ మందా దామోదర్, గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ సీఎండీ సయ్యద్ ఇమామ్, ప్రముఖ ప్రకృతి వైద్యులు ఎల్.వెంకన్న, వీసీ.స్వామి, సామాజిక కార్యకర్త బొజ్జ భిక్షమయ్య మాట్లాడారు. మనిషి సక్సెస్‌కు అంతం లేదని, హ్యాపినెస్‌తో కూడిన సక్సెస్ సాధించే వరకు కృషి చేస్తూనే ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా 40 రోజుల పాటు ఫిట్ ఇన్40 కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ ప్రగతి ఆరోగ్య కేంద్రం ప్రతినిధులు సీహెచ్.వీరారెడ్డి, కె.వెంకటేశ్వర్లు, కె.సుధాకర్, జైపాల్‌రెడ్డి, సలీం, సబిత, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బిహార్ ఓటర్ల డేటాపై స్పష్టత ఇవ్వాలి

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బిహార్ ఓటర్ల డేటాపై స్పష్టత ఇవ్వాలని అఖిలభారత మహిళా కాంగ్రెస్ బిహార్ రాష్ట్ర జాతీయ పరిశీలకురాలు డా.ఎస్తేర్‌రాణి డిమాండ్ చేశారు. శనివారం ఆమె చిక్కడపల్లిలో విలేకరులతో మాట్లాడారు. బిహార్‌లో దాదాపు 56 లక్షల ఓటర్ల పేర్లను జాబిత నుంచి తొలగించాలన్న నిర్ణయం అక్కడి ప్రజల్లో చర్చనీయాంశంగా మారిందన్నారు. 20 లక్షల ఓటర్లు మృతి చెందినట్లు, 29 లక్షల మంది ఓటర్లు ఇతర రాష్ట్రాలకు వలసెళ్లినట్లు, 7లక్షల ఓటర్లు బోగస్‌గా గుర్తించినట్లు బిహార్ ప్రభుత్వం వెల్లడించిందన్నారు. ఈ 56 లక్షల మంది 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎలా ఓటేశారు? ఇప్పుడు ఎందుకు తొలగించబడ్డారు? తెలుపాలన్నారు.

రైలు ప్రయాణికురాలి బ్యాగు చోరీ

బర్కత్‌పుర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బ్యాగును దొంగలు సత్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేటు ఉద్యోగి రాకేష్ శంషాబాద్ ఆర్‌బీనగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అజంతా ఎక్స్‌ప్రెస్ రైల్లో మన్మాడ్ నుంచి నగరానికి వస్తున్నాడు. ముత్కేడు రైల్వేస్టేషన్ వద్ద రాకేష్ తల్లి చేతిబ్యాగును దొంగలు సత్కరించారు. దానిలో రూ.10వేల నగదు, రూ.30 వేల విలువైన బంగారు గొలుసు, రెండు సెల్ ఫోన్లు ఉన్నాయి. శనివారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడు రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

కాచిగూడలో ఆటో డ్రైవర్ అదృశ్యం

బర్కత్‌పుర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ ఆటో డ్రైవర్ అదృశ్యమయ్యాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చప్పల్ బజార్‌లో నివాసముంటున్న పుల్లూరి మహేష్(45) ఆటో డ్రైవర్. మూడు రోజులుగా ఆటో నడపకుండా ఇంట్లోనే ఉన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 2.30గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు కుమారుడు నవీన్ శనివారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

బిహార్ జర్నలిస్ట్ హానర్ పెన్షన్ స్కీమ్‌ను స్వాగతిస్తున్నాం: టీడబ్ల్యూజేఎఫ్

నల్లకుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలో బీహార్ జర్నలిస్ట్ హానర్ పెన్షన్ స్కీమ్ కింద ఇచ్చే మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు. శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జర్నలిస్టుల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి సైకాలజిస్ట్‌లు అవసరం



మాట్లాడుతున్న మహేంద్రకుమార్‌రెడ్డి, పక్కన హిప్నో పద్మాకమలాకర్

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి సైకాలజిస్టుల నియామకమే మార్గమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా.మహేంద్రకుమార్‌రెడ్డి, ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డా.హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. విద్యార్థుల్లో పెరిగిపోతున్న ఆత్మహత్యలు, మానసిక ఒత్తిడులపై శనివారం అశోక్‌నగర్‌లోని డా.హిప్నో కమలాకర్ మైండ్ పర్సనాలిటీ కేర్‌లో ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఆరోగ్యంపట్ల సునితంగా స్పందించాలన్నారు. విద్యాసంస్థల్లో సైకాలజిస్టుల నియామకం అత్యవసరమని గుర్తించి సుప్రీంకోర్టు 2009లో జీవో నెంబర్ 19ని తప్పనిసరి చేస్తూ తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ ప్రతి పాఠశాల, కళాశాలలు సైకాలజిస్టులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణచర్యలు తీసుకుని విద్యాసంస్థల్లో సైకాలజిస్టుల నియామకం చేపట్టాలని కోరారు. దీనికోసం దేశవ్యాప్తంగా మౌనదీక్షలు, ప్రజాఉద్యమాలు చేస్తామన్నారు. గోపాలకృష్ణ, కృష్ణవేణి, క్యారలిన్, వీరభద్రం, లక్ష్మీ, జయశ్రీ, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి

5 లక్షల మంది పేదలకు ఇళ్లు : మంత్రి శ్రీధర్‌బాబు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 5 లక్షల మంది పేదలకు ఇళ్లు కట్టించేందుకు సిద్ధంగా ఉందని ఐటీ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నగర శివారు పెద్దఅంబర్‌పేట్‌లోని తారా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 10,050 మంది లబ్ధిదారులకు మంజూరీ అయిన కొత్త రేషన్ కార్డులను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మదుసూధన్‌రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు తీసుకురావాలి

బర్కత్‌పుర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన ఫలితాలు తీసుకురావాలని ఇంటర్ విద్యా శాఖాధికారి ఒడ్డెన్న సూచించారు. శనివారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. కళాశాలలో సీసీ కెమెరాల పనితీరును, తరగతి గదులలో క్లాస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వార్షిక పరీక్షల్లో ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కళాశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చిరంజీవి, సీనియర్ అధ్యాపకులు వి.ప్రసాదరావు, గీతాబాయి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వర్షాల వల్ల దోమలు వృద్ధి చెందకుండా జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ప్రత్యేకచర్యలు తీసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. శనివారం ఎంటమాలజీ సిబ్బంది ద్వారా ఫాగ్‌స్ప్రే వెహికిల్, సిబ్బందితో డివిజన్‌లో ఫాగింగ్ చేయించారు. ఈ కార్యమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ అజయ్, రమేష్, నవీన్ పాల్గొన్నారు.

ఐజీఎన్‌డీపీఎస్‌ను దివ్యాంగులందరికీ వర్తింపజేయాలి

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రం దివ్యాంగుల పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని, ఇందిరాగాంధీ జాతీయ దివ్యాంగుల పెన్షన్ పథకం(ఐజీఎన్‌డీపీఎస్) దివ్యాంగులందరికీ వర్తింపజేయాలని దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్, ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ఎంపీలు పార్లమెంటులో కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. 2021లో రాజస్థాన్ ప్రభుత్వం చేసిన చట్టంలాగే పార్లమెంటులో ప్రత్యేక చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు.

ఆగని వర్షంతో ఇబ్బందులు

ముషీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం ఏకధాటిగా పడడంతో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడం వల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షపునీరు నిలిచిపోవడం వల్ల బురదమయంగా మారింది. దీనితో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు.

తైక్వాండో.. ఆత్మస్థైర్యానికి దోహదం

ముషీరాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో క్రీడలు ఆత్మస్థైర్యానికి దోహదపడుతాయని తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి మారుతీ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర తైక్వాండో చాంపియన్ షిప్ 2025 సీనియర్, సబ్ జూనియర్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన మారుతీ వరప్రసాద్ విజేతలకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వాహజ్‌అలీ ఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం కృష్ణ, నాయకులు మహేశ్వర్, కృష్ణవంశీ, వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : టీడీపీ

రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరారు. వర్షాల వల్ల రహదారులు, అంతర్గతరోడ్లు దెబ్బతిని రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. శనివారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ వర్షాకాలంలో తలెత్తిన సమస్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

స్వర, గీత రచన, గానంలో మేటి సుధీర్‌కుమార్

చిక్కడపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్వర రచనతోపాటు స్వయంగా గీత రచన చేసి గానంలో ప్రతిభ ప్రదర్శించే ప్రతిభావంతులు సుధీర్‌కుమార్ అని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కేవీ.రమణాచారి అన్నారు. వంశీ ఇంటర్నేషనల్(ఇండియా) ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో ప్రసిద్ధ లలిత సంగీత దర్శకుడు, గాయకులు నల్లూరి సుధీర్‌కుమార్ సంగీత రంగంలో ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వంశీ జీవిత సాఫల్య సంగీత పురస్కారం ప్రదానోత్సవ సభ ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా డా.రమణాచారి పాల్గొని పురస్కారం ప్రదానం చేశారు. ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వంశీ రామరాజు, సుధాదేవి, శైలజ, సుధామయి పాల్గొన్నారు.

కులాల వారీగా వాటా దక్కడమే ప్రజాస్వామ్య స్ఫూర్తి

రాంనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కులం కారణంగా అవకాశాలు కోల్పోయిన ఆయా కులాలకు వారి జనాభా దామాషా ప్రకారం వాటా దక్కడమే నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తి అని వక్తలు అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జర్నలిస్ట్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో కులగణన ప్రాధాన్యం- అవసరం అనే అంశంపై ఫోరం అధ్యక్షుడు నీలం వెంకన్న అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ డా.అంబటి సురేందర్‌రాజు, కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ చేపట్టిన కులసర్వే బీసీ కులాల లెక్కలు తేల్చడంతోపాటు వారి సామాజిక ఆర్థిక రాజకీయ విద్యాప్రగతికి ప్రభుత్వం సరైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి దోహదపడుతుందన్నారు. సీపీఎం నేత రాములు, దొమ్మాట వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, నారాయణగౌడ్, రామ్మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.